# సంయమనం

సాంబమూర్తి ప్రధాన ఆలయం తలుపులకు తాళాలు బిగించాడు. రాత్రి పది దాటింది. రోజుకంటే ఆలశ్యం అయింది. మళ్ళీ రేపు అయిదుకల్లా తెరవాలి... అలా ముందుకు నడుచుకుంటూ వచ్చి ఆలయం ప్రహారీగేటును దగ్గరకు లాగి తాళం బిగించబోయాడు. కానీ ఏదో నీడలా కనిపించింది. ఎవరైనా లోపల ఉండి పోయారా?

కాసేపు ఆలోచించి తలుపులు తెరచి గుడి చుట్టుతా చూడాలని ముందుకు నడిచాడు. ప్రదక్షిణంలా నడిచాడు. ఎవరూ కనిపించలేదు. అంతా తన భ్రమ అనుకుని గేటు దగ్గరికి వచ్చాడు.

సన్నగా గాజుల సవ్వడి!

గిరుక్కున వెనుదిరిగి చూశాడు.

స్తంభం చాటుకు ఓ ఆకారం తప్పుకున్నట్లయింది.

ఎవరు? ఇంత రాత్రి ఎవరు?

దెయ్యం కాదుకదా! ఒక్క క్షణం గుండె పీచుమంది.

కాని గుడిలో దెయ్యమా?

అదీ ఈ కాలంలో ! వెంకటేశ్వర స్వామి గుడిలో !

అసంభవం ! ఎవరో మనిషి ఉంటాడు. స్వామి వారి నగలు దోచుకుందామని దాక్కుని ఉంటాడు.

సాంబమూర్తికి ఆ ఊహకే కోపం వచ్చింది.

గబగబ అటు అడుగులు వేశాడు.

ఎవరో వడివడిగా స్తంభాల చాటున దాక్కుంటున్నట్లు అడుగుల సవ్వడి! గాజుల రవళి!

సాంబమూర్తి పరుగెత్తినట్లు నటించి ఒక చోట ఆగిపోయాడు. కంగారులో ఆమూర్తి అతనికి ఎదురుపడింది.

ఆమె బిత్తరపోయింది.

వెన్నెల వెలుతురులో ఆమె అందంగా ఉంది. కాకపోతే భయపడిపోయినట్లుంది, వణుకుతుంది.

" ఎవరమ్మా నువ్వు ? ఇక్కడేం పని? గుడి మూసినా యిక్కడ దాక్కుని ఏం చేస్తున్నావు? స్వామి వారి నగలు దొంగతనం చేద్దామనుకున్నావా? చూడబోతే గొప్పింటి బిడ్డలాగున్నావు?" మందలిస్తూ అడిగాడు.

చేతులు అడ్డంగా ఊపుతూ ఆమె కన్నీరు కార్చింది.

" నీకోసం మీవాళ్ళు కంగారు పడుతుంటారు– ఇంటికి వెళ్ళు."

ఆమె తల అడ్డంగా ఊపింది.

" ఆ ! ఇంటికి పోవా ? ఎందుకు? అస్సలు నీకు మాటలు రావా? "

ఆమె తల దించుకుంది.

" తల దించుకునేటంత తప్పుడు పనులు చేశావా?"

చివ్వున తలెత్తి చూసింది. కళ్ళల్లో రోషం !

" పద పద ! నాకు ఆలశ్యమైంది– నిన్ను మీ యింటి దగ్గర దింపేసి వెళతాను. " కసురుతూ చెప్పాడు.

" నేను రాను - మీరు వెళ్ళండి!" ఆమె నోరు విప్పింది.

" నీకేమన్నా తిక్కా ! ఒంటరిగా యిక్కడే ఉంటావా?"

" ఆ ! ఉంటాను - తలుపులు వేసుకుని మీరు వెళ్ళండి!"

" ఇంతకీ నీ పేరేంటి?" కోపంగా అడిగాడు.

" సమీర ! " చెప్పింది. అతను పరిశీలనగా చూశాడు ఆమె కళ్ళల్లో భయం ఉంది.

" సమీర! ఏంటి నీ సమస్య. రాత్రి పూట యిక్కడ ఉండటం చాలా ప్రమాదకరం. అలిగావా? మీ వాళ్ళు అరిచారా? నే వున్నా సర్ది చెబుతా పద." అనునయంగా అడిగాడు. అతడికి తన కూతురు గుర్తుకొచ్చింది. చిన్న చిన్న విషయాలకు అలుగుతూ స్నేహితురాళ్ళ యిళ్ళకు పోయి రానంటుంది.

ఆమె కదలలేదు - మాట్లాడలేదు.

" పరీక్ష ఫెయిలయ్యావా?"

" ఆహా ! నా సమస్య మీ కర్థం కాదు. నన్ను వదిలిపెట్టండి." చేతులు జోడించింది.

" నువ్వు క్షణికావేశంలో ఏదో మాట్లాడుతున్నావు. మీ నాన్న సెల్లు నెంబరు చెప్పు ఆయనతో మాట్లాడతాను."

" దయచేసి ఆపని చేయకండి. నేను ఇక్కడున్నానని ఆయనకు తెలియనివ్వకండి. తెల్లారితే నా దారిన నేను పోతాను." ఏడుస్తూ చెప్పింది.

" నువ్వు ఎంత తప్పు చేస్తున్నావో నీకు అర్థం కావడం లేదు. సమీరా! ధైర్యంగా నా వెంటరా, మీ వాళ్ళకు అప్పచెబుతాను." కొంచెం గట్టిగా చెప్పాడు సాంబమూర్తి.

" ఏం నేబ్రతకడం మీ కిష్టం లేదా?" ఏడుస్తూ అడిగింది.

సాంబమూర్తి ఆ మాటలకు స్థాణువై పోయాడు. కాసేపటికి తేరుకున్నాడు.

" అస్సలేం జరిగింది?" అనునయిస్తూ అడిగాడు.

" మేము పెళ్ళి చేసుకోవడం మానాన్న కిష్టం లేదు."

" ఎందుకు?"

" గోపీకులం వేరు – మాది వేరు. అతను తక్కువ కులం వాడని మా నాన్న నమ్మకం. గుణానికి కులం ఏం అడ్డు అని నేను చెప్పినా వినడం లేదు. ప్రేమించిన అతన్ని మరచిపోయి – మా వాళ్ళు కుదిరించే సంబంధం చేసుకోవాలిట! కాని నా మనసు గోపికి యిచ్చేశాను. మనసులేని తనువును ఇంకొకరికి ఎలా యివ్వను?" అంటూ తమ ప్రేమ విశేషాలు – వివరిస్తూ – దానికి తల్లిదండ్రులు ఎలా అడ్డుపడుతున్నది చెప్పుకొచ్చింది.

" గోపీ ఎక్కడుంటాడు?"

" పొరుగూరిలో – కాని ఈరోజు పని పడి హైదరాబాదుకు వెళ్ళాడు. రేపుదయం కల్లా వస్తానన్నాడు. నేను ఈ గుడిలో వుంటే ఇట్నించి యిటే పట్నం వెళ్ళిపోదామన్నాడు."

" మీనాన్నకు ఈ వ్యవహారం ఎప్పుడు తెల్సింది?"

" ఈ రోజు మధ్యాహ్నం ! మండి పడుతున్నాడు – మా యిద్దర్ని చంపుతానంటున్నాడు. మా అమ్మ అడ్డు చెప్పినా వినడం లేదు. ఎక్కువ మాట్లాడితే ఆమెనీ చంపుతానంటున్నాడు." ఏడుస్తూ చెప్పింది సమీర.

సాంబమూర్తికి తల మొద్దు బారిపోయింది. ఈ ప్రేమ గొడవలు ఏంటి? ఈ కులాల గొడవలు ఏంటి? ఈ సెల్లు ఫోన్లు వచ్చింతర్వాత లోకమే మారిపోయింది.

"చూడు సమీరా! కన్నవాళ్ళు నిన్ను ఎందుకు చంపుతారు? నిన్ను ఎంత మమకారంతో పెంచారో నీకు తెల్సుగదా! అటువంటిది నిన్ను చంపి వాళ్ళు ఏం సుఖపడతారు?" లాలిస్తూ అడిగాడు.

" మీకు తెలీదంకుల్ ! మా నాన్నకు కులం పిచ్చి. పరువు మర్యాదలంటే పడి ఛస్తాడు. నేను యింటికి వెళితే కాళ్ళు చేతులు కట్టేసి మా కులంలోని కుర్రాడితో తాళి కట్టిస్తాడు" భయం భయంగా చెప్పింది సమీర.

దిక్కు తోచక గుడి కాంపౌండు గేటుకు తాళం పెట్టి వచ్చేశాడు. తల గిర్రున తిరుగుతున్నది.

" ఏం నాన్నా ఇంత ఆలశ్యం అయింది!" ఇంటి తలుపు తెరుస్తూ అడిగింది కూతురు మహాలక్ష్మి.

అన్యమనస్కంగా లోపలికి వచ్చాడు. భార్య తాయారమ్మ మంచంలో మూలుగుతూ పడుకునుంది. ఆమె నిత్యరోగిష్ఠి.

బాతురూముకు వెళ్ళి కాళ్ళు చేతులు మొహం కడుక్కుని వచ్చాడు.

" అన్నం వడ్డించనా?" పీట వాల్చి కంచం పెడుతూ అడిగింది మహాలక్ష్మి.

" ఆకలి లేదమ్మా ! నువ్వు తిన్నావా?" అడిగాడు.

" నాకూ ఆకలి కాలేదు." కంచం తీసేస్తూ చెప్పింది.

" వద్దు - అలాగయితే యిద్దరం తిందాం - పెట్టు-"

మవునంగా భోజనం చేస్తున్నారు-

మజ్జిగ కలుపుకున్నాడు. ఉన్నట్లుండి అడిగాడు.

" చిట్టీ ! నువ్వు ఎవరినన్నా ప్రేమించావా?"

మహాలక్ష్మి బిత్తరపోయింది. ఊహించని ప్రశ్న.

" ఎందుకు అనుమానం వచ్చింది!" ఆశ్చర్యంగా అడిగింది.

" ఆకలి లేదంటుంటే -"

" ప్రేమించిన వాళ్ళకు ఆకలి దప్పులుండవా?"

" కాదమ్మా ! నేను కూడా నా బాధ్యత విస్మరించాను. నీకు పాతిక దాటినా పెళ్ళి చెయ్యలేదు." బాధగా అన్నాడు.

దానికి మహాలక్ష్మి తలవంచుకుంది. రెండు కన్నీటి బొట్లు ఆమె కంచంలో పడ్డాయి. చెయ్యి కడుక్కుంది.

నిజానికి ఆమె ఫ్రెండ్సుకు ఐదారు సంవత్సరాల క్రిందటే పెళ్ళిళ్ళు అయిపోయాయి. కొందరికి ఇద్దరు పిల్లలు కూడా. నలుగురిలోకి పోయినప్పుడు నలుగురు నాలుగు రకాలుగా వ్యాఖ్యానిస్తూ ఉంటారు. అల్లరి మూకలు శ్రుతిమించి ఆగడాలు చేస్తూ ఉంటారు కూడ. కాని ఆర్థిక పరిస్థితి ! తండ్రికి పెళ్ళి చేసే స్తోమత లేదు. తను వెళ్ళిపోతే తల్లికి సేవలు చేసే వాళ్ళు కూడ దొరకరు.

సాంబమూర్తి కొన్ని సంబంధాలు చూశాడు. ఓ మాదిరిగా సంపాదిస్తున్న వారికి కట్నం ఆశలు. తను అందుకోలేదు. తన్లాగా సంపాదన లేని దరిద్ర నారాయణులను చేసుకోనంటున్నది.

నిజమే ! ఈ కాలం ఆర్థిక సమస్యలు అన్ని సమస్యలకు మూలం! అందుకే మహాలక్ష్మి తనలాంటి వారింటికి వెళ్ళడానికి యిష్టపడటం లేదు. వెళ్ళి బాధలు పడేకంటే పుట్టింట్లో ఉండటం మేలేమో!

" ఇప్పుడు నా పెళ్ళికి తొందరేమొచ్చింది నాన్నా?" బలవంతాన నవ్వుతూ అడిగింది.

" నిజం ! ఆ దేవుడు దయచూపించే దాకా ఆగాల్సిందే గదా!"

" దేముడు మటుకు ఏం చేస్తాడులే నాన్నా! తనకుతాను సహాయం చేసుకునే వాళ్ళకు ఆయన సహాయపడతాడుగాని".

" అమ్మా ! నాకో మాటివ్వమ్మా ! ఇస్తావా?" దీనంగా అడిగాడు.

" ఏంటి నాన్నా కొత్తగా అడుగుతున్నావు?" విస్మయంగా అడిగింది.

" ఏం లేదమ్మా ! ఈ దౌర్భాగ్యుడు పెళ్ళి చేసేదాక వేచి వుండమ్మా! అంతలో ప్రేమలు - దోమలు అంటూ తలవంపులు తీసుకురాకమ్మా!" కళ్ళు తుడుచుకుంటూ అడిగాడు సాంబమూర్తి.

" నాన్న ! నేను నీ కూతురిని ! పెళ్ళి జీవితంలో ఒక భాగమే! పెళ్ళే జీవితం కాదు. పెళ్ళి చేసుకోకుండా ఎంత మంది బ్రతకడం లేదు. చైనా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధ కన్యలకు, వృద్ధ వరుళ్ళకు లోటు లేదు. నేను కాలు జారేటట్లయితే ఎప్పుడో జారేదాన్ని! ఇన్నాళ్ళు ఆగి యవ్వనం వృధా చేసుకునే దాన్నా?! ఇంక ప్రేమలు అంటావా! అవి సినిమాలలో జరిగేవే!" కన్నీళ్ళు ఒత్తుకుంటూ చెప్పింది. మనసులో అగ్నిపర్వతం బద్ధలయింది.

" అర్ధరాత్రి అంకమ్మ శివాల్లా ఏంటా గోల! తండ్రి కూతుళ్ళు ఏం గొడవ పడుతున్నారు?" మంచం మీంచి కేక పెట్టింది సాంబమూర్తి భార్య తాయరమ్మ.

" పశువులు - పక్షులకున్న స్వాతంత్ర్యం నాకు లేదు. అగ్రకులంలో పుట్టినందుకు సాంప్రదాయాలకు బానిసను!" చెప్పింది బాధగా మహాలక్ష్మి

"యవ్వనానికి సంకెళ్ళు వేస్తున్నానని అనుకోకమ్మా!" బాధగా చెప్పాడు గుండె చిక్కపట్టుకుని సాంబమూర్తి.

" కొందరి అదృష్టాలు అంతే నాన్న! మంచి పూజలు చేసుకోకుండా పుట్టి అన్నీ కావాలంటే ఎక్కడ నుండి వస్తాయి?" ఆవేదనతో చెప్పింది మహాలక్ష్మి.

తెల్లవారు ఝామున నాలుగు గంటలకు సమీర తండ్రి కోటిరెడ్డి వచ్చి సాంబమూర్తిని గుడికి తీసుకువచ్చాడు. తలుపులు తెరవమని.

గోడ ఎక్కి పారిపోదామని ప్రయత్నిస్తున్న సమీర, గోపీలు వారి కంట పడ్డారు తలుపులు తీసి లోపలి కొచ్చేసరికి.

" రేయ్ ! అక్కడ ఆగరా! నరికి పోగులు పెడతాను!" గొడ్డలి తీసుకుని మీదకు పోయాడు కోటిరెడ్డి.

" నాన్న ! ఆగు ! ముందు నన్ను చంపి -గోపిని చంపు!" అడ్డుపడింది సమీర. - నీకు మాకంటే పరువే ముఖ్యమా?" బాధగా ప్రశ్నించింది.

" ఆ ! పరువు పోయింతర్వాత బ్రతకడం ఎందుకు? మిమ్మల్నిద్దర్నీ యిక్కడే

నరికేస్తాను" గొడ్డలి ఎత్తాడు.

సాంబమూర్తి పోయి గట్టిగా అతని చెయ్యి పట్టుకున్నాడు.

" వదులు పంతులూ !అనవసరంగా నీ ప్రాణాలు పోగొట్టుకోమాకు" బెదిరించాడు కోటిరెడ్డి.

" రెడ్డీ ఒక్కమాట ! వీళ్ళిద్దర్ని చంపుతావు – పోయిన నీ పరువు తిరిగి వస్తుందా? ముందు నిన్ను చట్టం వదులుతుందా? హంతకుడి ముద్రవేసి ఉరికంబం ఎక్కిస్తుంది. జైలుకు పోవడం ఉరికంబం ఎక్కడం నీకు పరువైన పనా?" సాంబమూర్తి అడిగాడు.

" అందుకే వాళ్ళను చంపి నే ఛస్తాను" రోషంగా అన్నాడు.

" కానీ నాన్నా ! మాకు బ్రతకాలని ఉంది – మమ్మల్ని వదిలిపెడితే మా దోవన మేము పోతాం!" చేతులెత్తి వేడుకుంది సమీర.

" చంపినా మీ కళ్ళముందుండం – అదే మేము దూరంగా మీకు కనిపించకుండా వెళ్ళిపోతాం!" గోపీ కూడా బ్రతిమాలాడు.

" ఛీ ! కులం తక్కువ వాడివి – నా కూతుర్ని చేసుకుంటావా?"

" రెడ్డీ ! కులం పుట్టుకలో లేదు. గుణంలో ఉంది. వాళ్ళని చంపి నువ్వు కసాయికులంలోకి చేరిపోతావు. కన్నకూతురిని చంపుకున్నావని కడుపుకోత నిన్ను మనశ్శాంతితో బ్రతకనివ్వదు!" సాంబమూర్తి నచ్చ చెప్పాడు.

" అయితే వాళ్ళు చేసింది మంచిపనా!" రెడ్డి హూంకరించాడు.

" కాకపోవచ్చు. కాని వాళ్ళు మేజర్లు. వాళ్ళకి వయస్సు, బుద్ధి, జ్ఞానం ఉన్నాయి. పెద్దయిన తరువాత ఎవరి జీవితాలు వాళ్ళవి!" అంటూ నచ్చ చెప్పాడు.

సమీర గోపీ దండాలు పెడుతూ వెళ్ళిపోయారు.

కోటిరెడ్డి గొడ్డలి కిందపడేసి గుండెలు బాదుకుంటూ రోదిస్తున్నాడు.

– ఆలోచించండి, సెప్టెంబరు 2013